# జీవితానికి మరోవైపు




సహజ కవి మల్లెమాలగారి జీవితం సహజత్వాని కి భిన్నంగా ఉండదు. దేవీప్రియ మాటల్లో చెప్పాలంటే 'సహజకవికి చిరునామా, ఇప్పుడు కూడా కౌముది, గత జీవనస్మృతి వీడదు. మల్లెమాల గుణమది' మల్లెమాలగారు సినిమాల్లో ఉన్నప్పటికీ ఆయన పొందిన ఎన్నో అపజయాల చివరి కొసమెరుపు సూపర్‌హిట్ 'అంకుశం'. అంత సహనశీలి మల్లెమాల సూపర్‌హిట్ 'అంకుశం' అని కీర్తించారు. ఆ మాట నిజమే. ఆయన జీవితం గూర్చి విశేషాలు చెప్పమని అడిగితే గ్రంథస్థం చేయవలసినంత గొప్ప ఏమీ నాలో లేదు. నా జీవితం నాకే ప రిమితం అనే వినయశీలి మల్లెమాల.

ఇటీవల ఉదయం నవతరం వారపత్రికలో సినిమా సెక్షన్‌లో ఆయనతో ఇంటర్వ్యూ వస్తుందనుకుంటే దానికి బదులుగా ఆయన జీవితకథ మరో యువరచయిత చెప్పడం ప్రారంభించారు. న్యాయానికి మల్లెమాలగారు తన జ్ఞాపకాలు, అనుభవాలను తనే ఒక మాలగా కూర్చగలరు. ఆయన జీవితచరిత్రను మరో నవలారచయిత వ్రాయవలసినంత ఇబ్బంది ఆయనకేమీ లేదు. కానీ ఎలాగో జరిగిపోయింది. ఆయన కవి. సంభాషణాచతురుడు. ఉపన్యాసకుడు. అధ్యక్షపీఠం అలంకరిస్తే అందరికంటే ఎత్తుగానే కనబడే వ్యక్తిత్వం ఆయనకి శ్రీరామరక్ష. మల్లెమాలగారు తమ స్మృతివీణను తామే మోగించగలరు. ఇతరులు అందులో ముఖ్యంగా నవలారచయితలు చెప్పిందే చెప్పి ఆయన జీవితంన్నుంచి ఎటువంటి సస్పెన్స్ థ్రిల్లర్‌ను లాగలేరు. ఆయన విజయం వారి కుటుంబ సభ్యుల విజయం. సన్మానాలు, బిరుదులు, పొగడ్తలు వీటన్నిటికీ దూరంగా ఉండే సహజకవి. వ్రాయదల్చుకుంటే వారి జ్ఞాపకాలను వారే వ్రాస్తారు. కనుక ఇంతటితో ఈ 'జీవితానికి మరోవైపు' శీర్షికలో నడుస్తున్న కథను ముగిస్తున్నామని సవినయంగా మనవి చేస్తున్నాము.

—పి

(అయిపోయింది)



# డబ్బుముట్లో మనుషులు

ఆ ఉత్తరం చూసిన నేను స్టన్ అయ్యాను.

అన్ని విధాలా అనుకూలంగా ఉందనిపించి ఆఖరిగా బాగా ఆలోచించుకొనిగాని ఈ పెళ్లికి అసలు ఒప్పుకోలేదు నేను.

కానీ—

ఏమిటిలా జరిగింది?

నా కళ్లముందు ఒక్కసారి ఆమె రూపం కదలాడింది.

ఆరోజు...

కాలేజ్ నుంచి కాస్త తొందరగా వచ్చేశాను.

ఆ అమ్మాయి ఫాదర్ మదర్ అనుకున్నట్టుగానే వచ్చారు.

అతిథి సత్కారాలన్నీ బాగానే జరిగాయి.

"అమ్మాయి అబ్బాయి నచ్చుకున్నారు. ఇక త్వరగా ముహూర్తం పెట్టడం మంచిది" మధ్యవర్తి అన్నారు.

"ఉభయ ఖర్చులు భరించి పెళ్లి చేస్తాం— కట్నాలు ఇచ్చుకోలేం" అంది అమ్మాయి తల్లి.

కట్నానికి ప్రాధాన్యత ఇవ్వని నేను కామ్‌గా ఊరుకున్నాను.

నేను అమ్మాయిని నచ్చడమే చాలని అమ్మా నాన్నా ఓకే అన్నారు.

* *** *

ఆషాడం శ్రావణ మాసాలలో ముహూర్తాలులేవు.

నిజ శ్రావణంలో పెళ్లి ఫిక్స్ అయ్యింది.

ఆ విషయం కాలేజీతో సహా అందరికీ తెలిసి పోయింది.

కాలం చాలా వేగంగా వెళ్తోంది.

శ్రావణం అయిపోవస్తోంది.

శుభలేఖలు పంచాల్సిన తరుణంలో వచ్చిందీ ఉత్తరం.

ఉత్తరం నా చేతుల్లో నలిగిపోయింది.

ఆదివారం

మధ్యవర్తి ఓ ఇన్‌లేండ్ లెటర్ పట్టుకొచ్చారు.

"అబ్బాయి పనిచేస్తున్న కాలేజ్ పూర్తిగా పర్మినెంట్ కాదు, అంత సస్పెన్స్‌గా వున్న కాలేజ్‌లో పని చేస్తున్న అబ్బాయికి మా అమ్మాయినిచ్చేసి తర్వాత బాధపడేకంటే, ముందే విరమించుకోడం మంచిది. కాబట్టి పెళ్లి చేయడానికి తగిన డబ్బు లేకపోయి నందువల్ల ఫోటోలు తిప్పి పంపమని రాశాం. వాళ్లు ఏమనుకున్నా చేసేదేంలేదు. మిమ్మల్ని ఇబ్బంది పర్చాం. క్షమించండి" అసహ్యంగానే చదివారా లెటర్‌ని మధ్యవర్తి.

చాలా బాధపడ్డారు.

* *** *

నా కాలేజ్ ఆంధ్రా యూనివర్శిటీ అనుబంధ సంస్థ. ఓపెన్ అయి ఓ సంవత్సరం దాటింది. రెండో సంవత్సరం నడుస్తోంది. అలా అయిదు సంవత్సరాల అనుబంధ సంస్థగా నడిచాకనే యుజిసి గ్రాంట్స్ వస్తాయి. అప్పటికి అందులో పనిచేస్తున్న స్టాఫ్ రిలీఫ్ ఫీలవుతాం. గవర్నమెంట్ అడ్డుపెట్టినా సుప్రీంకోర్టు తీర్పు అనుకూలంగానే వుంటుంది. మా కాలేజ్‌లో సీటు తెచ్చుకోవాలంటేనే బిఇడి కామన్ ఎంట్రన్స్ రాసి మంచిరాంక్ తెచ్చుకుంటే గాని సీలవదు. అలాంటిది అందులో పనిచేసే లెక్చరర్‌పై నమ్మకంలేదు. డబుల్ పోస్టుగ్రాడ్యుయేషన్ గంగలో కలిసిపోయింది.

## పురిజాల సుధాకర్

ఏం మనుషులు?

ఈ మనుషులు ఒట్టి మెటీరియలిస్టులుగా మారిపోతున్నారు.

డబ్బు సంపాదించలేడని తెలిస్తే వీళ్లు మనిషిని గడ్డిపోచకన్నా చులకనగా చూస్తారు.